క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలో సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పవర్ ఆఫీస్ ఏఈ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి బస్టాండ్ నుంచి పల్లపోతు వారివీధి, తహసీల్దార్ కార్యాలయం, విద్యానగర్ పరిసరాలలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయ నూతన భవనం వద్ద కరెంటు స్తంభాల మార్పిడి సందర్భంగా సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ తెలిపారు.

300 మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: నగరంలోని అంజయ్యరోడ్డు పేలప్రోలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారెళ్ల కాశీరత్తమ్మ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ పేలపోలు రామకృష్ణ పరమహంస వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఒంగోలుకు చెందిన విజయశ్రీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డి.వెంకటేశ్వర్లు, సురేష్ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రిమ్స్ వైద్యశాల ఆవరణలో శివం ఫౌండేషన్ ద్వారా 300 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు మంచినేని మాధవి, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ నంబర్ ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

ఒంగోలు టౌన్: నగరంలోని దేవుడి చెరువు వద్ద సింగిల్ నంబర్ ఆడుతున్న ఏడుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. దేవుడి చెరువు వద్ద కొందరు వ్యక్తులు చేతిలో స్లిప్‌లు పట్టుకుని అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూడగానే పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించిన కేరళ సింగిల్ నంబర్ లాటరీలను నిర్వహిస్తున్నట్లు అంగీకరించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి రూ.21,400 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షునిగా కుంచాల

ఒంగోలు: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షునిగా కుంచాల వెంకట శివ నియమితులయ్యారు. జిల్లా పార్టీ కార్యాలయ వ్యవహారాల ఇన్‌చార్జిగా కూడా కుంచాలను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి ఆదివారం స్థానిక కార్యాలయంలో నియామకపత్రం అందించారు.

1363 మంది రైతులకు పంటనష్ట పరిహారం

కొమరోలు: మండలంలో 1363 మంది రైతులకు పంట నష్టపరిహారం మంజూరైనట్లుగా మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాజశ్రీ తెలిపారు. మండలంలో కందిపంట సాగుచేసి వర్షాలకు పంట నష్టపోయిన ఒక్కొక్క రైతుకు రూ.12433 వంతున రూ.2.408 కోట్ల నష్టపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. మండలంలో 1937.3 ఎకరాల్లో కందిపంట అకాల వర్షాలకు నష్టపోయారని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెళ్లకు గాయాలు

మార్కాపురం: బైకు అదుపుతప్పి అన్నాచెల్లెళ్లు గాయపడిన సంఘటన ఆదివారం మార్కాపురం మండలంలోని చింతగుంట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. త్రిపురాంతకం మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన కె.వెంకటరెడ్డి, నారాయణమ్మ అన్నాచెల్లెళ్లు. కంభంలో ఆదివారం ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలో చింతగుంట్ల గ్రామ సమీపాన మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులకు మార్కాపురం జిల్లా వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ముస్లింలు

గిద్దలూరు రూరల్: ముస్లిం మైనార్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ముస్లిం మైనార్టీల సంఘం అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాష కోరారు. పట్టణంలోని కొంగలవీడురోడ్డులోని బిలాల్ మసీదు ఆవరణలో ఆదివారం నియోజకవర్గ మైనార్టీ సంఘ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు హుస్సేన్, పీరా, చాంద్‌బాష, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు బాసట

- రైతు భరోసా అమలుతో తొలగిన కష్టాలు
- ప్రభుత్వ ఆదరణతో కౌలు రైతుల హర్షం



పత్తి పంటలో అంతర సేద్యం చేస్తున్న రైతు

రాచర్ల:

గత ప్రభుత్వాలు కౌలు రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేశాయి. కంటి తుడుపుగా రుణ అర్హత పత్రాలను చేతిలో పెట్టి చేతులు దులుపుకున్నాయి. రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యాజమాన్య రైతులతో సమానంగా కౌలు రైతుల సంక్షేమానికి బాట వేసింది. బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటూనే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసింది. పెట్టుబడి సాయంతో కౌలు రైతులకు అండగా నిలుస్తోంది. గడిచిన నాలుగేళ్లుగా రాచర్ల మండలంలో వందలాది మంది కౌలు రైతులకు పెట్టుబడి నిధి అందిస్తోంది. రాచర్ల మండలంలోని 14 పంచాయతీల్లో 15 వేల ఎకరాల సాగు భూమి ఉంది. 8 వేలకు పైగా రైతులు ఉన్నారు. 656 మంది దాకా కౌలు రైతులున్నారు. అర్హత రీత్యా 651 మందికి రైతు భరోసా పెట్టుబడి నిధి అందుతోంది. ఏటేటా కౌలు రైతుల లబ్ధి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. గడిచిన మూడేళ్లలో మండలంలో 1418 మంది కౌలు రైతులు పెట్టుబడి సాయం పొందారు. 2020 సంవత్సరంలో 402 మంది, 2021లో 365 మంది, 2022 సంవత్సరంలో 651 మందికి నిధులు మంజూరయ్యాయి.

జగనన్న ప్రభుత్వంపై కౌలు రైతులు హర్షం

గత ప్రభుత్వాలకు భిన్నంగా జగనన్న ప్రభుత్వం సంస్కరణలు తీసుకుని రావడంతో వ్యవసాయ రంగంలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా యాజమాన్య రైతులకు సమానంగా పెట్టుబడి సాయం రూ.13,500 మంజూరు చేయడంతో పాటు పెట్టుబడి సాయం, రైతు రుణాలు, గిట్టుబాటు ధరలు కల్పిస్తుండటంతో కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాచర్ల మండలంలో ఇలా..

సంవత్సరం	కౌలు రైతులు	మంజూరైన పెట్టుబడి సాయం
2020	402	రూ.54,27,000
2021	365	రూ.49,27,500
2022	651	రూ.87,88,500

రైతు భరోసా అందింది



చాలాకాలంగా 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాను. గతంలో కౌలు రైతులను పట్టించుకునే వారు కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి రైతు భరోసా కింద రూ.13,500 నగదు అందించింది. యాజమాన్య రైతులతో సమానంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుండటంతో చాలా సంతోషంగా ఉంది.

– షేక్.నాయబ్ రసూల్, కౌలు రైతు, రాచర్ల గ్రామం

కౌలు రైతులను ఆదుకోవడం గొప్ప విషయం



గత ప్రభుత్వాలు కౌలు రైతులను పట్టించుకోలేదు. రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులను ఆదుకోవడం గొప్ప విషయం. లక్షలాది మంది కౌలు రైతులకు పెట్టుబడి నిధి అందించడం ఎంతో సంతోషం. మాలాంటి కౌలు రైతులకు రైతు భరోసా అండగా నిలుస్తోంది.

– పానెం భాస్కర్, కౌలు రైతు, యడవల్లి

మాయమాటలతో మోసం

- ఒరిస్సా యువతిని పెళ్లాడిన యువకుడు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఒంగోలు టౌన్: అప్పటికే అతడికి పెళ్లయి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మరో అమ్మాయికి మాయమాటలు చెప్పి పెళ్లిచేసుకున్నాడు. తీరా అసలు విషయం బయటపడేసరికి ఊరికి వెళ్లిపొమ్మంటూ వేధిస్తున్నాడని ఒరిస్సాకు చెందిన ఒక యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో భాగంగా శిక్షణ నిమిత్తం ఒంగోలు వచ్చి ఒక రెస్టారెంట్‌లో శిక్షణ పొందుతున్న ఒరిస్సాకు చెందిన బాగ్ రేవతి అనే యువతికి ఒంగోలు మారుతీనగర్‌కు చెందిన చెన్నుబోయిన వినోద్ కుమార్‌తో పరిచయమైంది. పెళ్లి కాలేదని చెప్పిన అతడు.. స్నేహితుల సమక్షంలో ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ఆరు నెలల తర్వాత ఆమెకు అసలు విషయం తెలిసింది. అంతకుముందే వినోద్‌కు చీమకుర్తి చెందిన అనూరాధ అనే యువతితో వివాహం జరిగిందని, వారికి ముగ్గురు సంతానం కూడా ఉన్నారని తెలిసింది. మోసపోయినట్లు గ్రహించిన రేవతి అతడిని నిలదీయడంతో వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈలోపు రేవతి ఆడపిల్లకు జన్మనిచ్చింది. భర్త వేధింపులు తాళలేక దిశ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. వారు భార్యాభర్తలిద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో వినోద్ తల్లి విజయ, మొదటి భార్య, అక్క కుమారుడు జ్యోతి వచ్చి రేవతిని దూషించి ఆమెపై దాడి చేశారు. మర్యాదగా ఒరిస్సా వెళ్లిపొమ్మని బెదిరించారు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణాధికారిగా ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావును నియమించారు. బాధితురాలికి న్యాయం చేయాలని దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరావు, కొమ్ము సృజన్ డీఎస్పీని కోరారు.

కామేపల్లివారిపాలెంలో సినిమా షూటింగ్



సినిమా షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: మన రాజ్యం సినిమా షూటింగ్‌ను వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆదివారం మండలంలోని కామేపల్లివారిపాలెంలో క్లాప్ కొట్టి ప్రారంభించారు. సిద్ధార్థ్ భీమ్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో దాసరి మీనా కుమారి సమర్పణలో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత దండేల కృష్ణ తెలిపారు. సినిమా షూటింగ్‌లో పాలడుగు విజేంద్ర బహుజన్ కెమేరా స్విచ్ ఆన్ చేయగా, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యులు తొలుత సినిమాకు గౌరవ దర్శకత్వం వహించారు. సెప్టెంబర్‌లో సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తామన్నారు. యదార్థ సంఘటన ఆధారంగా సందేశాత్మక చిత్రంగా నిర్మిస్తున్నామని, నటీనటుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని దర్శకుడు ఎద్దు కిరణ్‌కుమార్ తెలిపారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న కార్పొరేటర్ సురేష్‌బాబు

ఒంగోలు టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్‌బాబు కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక భాగ్యనగర్, హౌసింగ్ బోర్డులో ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదర మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఇది పేదల ప్రభుత్వమని, నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు ఆర్.రాజేష్, టి.కరుణాకర్, రవి, పృథ్వీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రహదారులకు రూ.16.90 కోట్లు మంజూరు

దర్శి: దర్శిలో మూడు రహదారులకు రూ.16.90 కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దర్శి–దొనకొండ రోడ్డుకు రూ.3.10 కోట్లు, గంగవరం –తాళ్లూరు రోడ్డుకు రూ.4.80కోట్లు, వెంకటాచలంపల్లి–దొనకొండ వయా రెడ్డన్నపల్లె, వెస్ట్ గంగవరం రోడ్డుకు రూ.9 కోట్లు నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నిధుల మంజూరుపై నాయకుల హర్షం

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని తూర్పు గంగవరం– తాళ్లూరు రోడ్డు అభివృద్ధికి రూ.4.80 కోట్లు నిధులు మంజూరు చేయించినందుకు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, ఆయన సోదరుడు మండల ఇన్‌చార్జ్ మద్దిశెట్టి రవీంద్రలకు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డిలు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఆ రోడ్డుతో ఇబ్బందులు పడుతుండగా..ఎట్టకేలకు రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో మండల ప్రజల చిరకాల కోరిక నెరవేరినట్లు వారు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన వారిలో వైస్ ఎంపీపీలు ఐ వెంకటేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, సర్పంచ్‌లు మేకల చార్లెస్‌సర్జన్, శ్రీకాంత్‌రెడ్డి, వలి, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న రంజిత్

కొండపి: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జి వై రంజిత్ అన్నారు. మండలంలోని పెరిదేపిలో ఎస్సీ కార్పొరేషన్, ప్రకృతి వ్యవసాయ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం వారిచే ఉచితంగా రూ. 10000 విలువైన కిట్లు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రకృతివ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్ మాల్యాద్రి పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు: కందుకూరు గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునర్ నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందుతూనే ఉన్నాయి. దీనిలో భాగంగా ఆదివారం జీఎంఆర్ కూరగాయలషాపు యజమాని గుమ్మా మోహన్‌రావు, అంజలి దంపతులు తమ కుటుంబ తరుపున రూ.25,116 విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకట్‌రెడ్డికి అందజేశారు. నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా వాసవి పత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ అభివృద్ధిపై దృష్టి సారించాలి



శ్రీకర్‌ను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

మార్కాపురం: యువత టెక్నాలజీ, యాప్స్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్‌అలీబేగ్, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, చీమకుర్తి తహసీల్దార్ పిన్నిక మధుసూదన్ పేర్కొన్నారు. ఇటీవల మ్యాక్స్ ఓట్ యాప్ రూపొందించిన శ్రీకర్‌ను స్థానిక బీసీ భవన్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంపై వచ్చే యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి బాలయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు రంగస్వామిగౌడ్, డాక్టర్ శ్రీకాంత్, పిన్నిక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహ బంధం.. ఎంత మధురం!



పాఠశాల వద్ద పూర్వ విద్యార్థులు

మార్కాపురం: సుమారు 36 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న బాల్య మిత్రులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ అపూర్వ కలయికకు మార్కాపురం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వేదికైంది. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఆదివారం ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. అనంతరం ర్యాలీగా ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న శుభమ్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుని సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థుల్లో బ్యాంక్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు, పారిశ్రామికవేత్తలు ఉన్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠశాలలో తాము చదువుకున్న తరగతి గదులకు వెళ్లి అలనాటి సంగతులను గుర్తుచేసుకున్నారు. చదువు చెప్పిన గురువులైన విశ్రాంత డీవైఈఓలు మల్లికార్జునరావు, రంగస్వామి, పీఈటీ అల్లూరయ్యను ఘనంగా సన్మానించారు. మిత్ర మండలి సభ్యులైన గుంటక సుబ్బారెడ్డి, పాదర్తి శ్రీను, అన్నా రాము, చంద్ర, జీఎల్ నరసింహరావు, నాగరాజు, తన్నీరు వెంకటరమణ, డాక్టర్ బాషా, డీవీ, కామేశ్వరరావు, ఎంఆర్‌కే బాషా, డీవీఆర్, పీవీ కృష్ణారావు, సుధాకర్, రహ్మతుల్లా తదితరులు ఆత్మీయ సమ్మేళనాన్ని సమన్వయం చేశారు. భవిష్యత్తులో మిత్ర మండలి తరఫున సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

జీవామృతంతో పంటలకు విలువైన పోషకాలు



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న భవాని

పొన్నలూరు: రైతులు సాగుచేసే పంటకు ప్రకృతి సిద్ధమైన ఘన ద్రవ జీవామృతాన్ని వాడితే విలువైన పోషకాలతో అధిక దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ సీహెచ్ భవానీ అన్నారు. మండలంలోని ముప్పాళ్లలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భవానీ మాట్లాడుతూ స్థానికంగా దొరికే ముడి పదార్థాలతో జీవామృతాన్ని తయారు చేసుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో జీవామృతాన్ని తయారు చేసుకోవచ్చని సూచించారు. పంట సాగుకు ముందు పొలంలో పిచికారీ చేయడం వల్ల భూమిలో సత్తువ నిల్వలు పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. తద్వారా రైతు లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీపీ కోటేశ్వరరావు, పీఆర్పీ పద్మశ్రీ, కేఆర్పీ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాళ్లూరు(ముండ్లమూరు): తాళ్లూరు వీకే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991 – 1992 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, కోటిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. విద్యార్థులలో ప్రస్తుతం ఉన్నత శిఖరాలకు ఎదిగిన వారిని అభినందించి దీవించారు. తమతో పాటు చదివి నేడు కష్టంలో ఉన్న వారిని గుర్తించి వారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. తమ వంతు సాయంగా పాఠశాల అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని నిర్ణయం తీసుకున్నారు.

పోగొట్టుకున్న నగదు తిరిగి అప్పగింత

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని హోటల్ హరివిల్లులో ఓ వ్యక్తి పోగొట్టుకున్న రూ.17,500 నగదును హోటల్ యాజమాన్యం తిరిగి అప్పగించింది. ఆదివారం మండల కేంద్రంలోని హోటల్ హరివిల్లులో డబ్బులు దొరికిన విషయాన్ని సిబ్బంది యజమానులు కరీం, మజీద్‌లకు తెలపగా ఆ ప్రయాణికుడి కోసం ఆరా తీశారు. మూడు గంటల అనంతరం డబ్బులు పోగొట్టుకున్న ప్రయాణికుడు హోటల్‌కు తిరిగి వచ్చి పోగొట్టుకున్న నగదు వివరాలు తెలపటంతో యజమానులు డబ్బులు అతనికి తిరిగి ఇచ్చారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ



మొక్క నాటుతున్న ఎస్సై ఆదిలక్ష్మి

అద్దంకి: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ చేసినట్లేనని ఎస్సై ఆదిలక్ష్మి అన్నారు. ఆమె ఆదివారం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు విడుదల చేసే ఆక్సిజన్‌తో పర్యావరణంలోని విషవాయులు శుద్ధి అవుతాయన్నారు. రాబోయో కాలంలో గ్లోబల్ వార్మింగ్ రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

అద్దంకి: పట్టణంలో ఇటీవల గంజాయి పెద్ద మొత్తంలో పట్టుబడడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. జిల్లా ఎస్పీ మకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి పట్టణంలోని గుర్రాల కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వివరాలను ఆదివారం సీఐ ఉమేశ్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. జిల్లా నుంచి వచ్చిన 80 మంది పోలీసులు మహిళా కానిస్టేబుళ్ల సాయంతో కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు చెప్పారు. పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. గంజాయి, నాటుసారా తయారీని అరికట్టడమే లక్ష్యంగా సెర్చ్‌ను నిర్వహించామని చెప్పారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు తెలిసినా, తరలిస్తున్నట్లు తెలిసినా పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈసెర్చ్‌లో ఎస్సై ఆదిలక్ష్మి, జే పంగులూరు ఎస్సై తిరుపతిరావు, కొరిశపాడు ఎస్సై చౌదరిలు పాల్గొన్నారు.